తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వైభవంగా జరిగిన పోలేరమ్మ జాతర ఘటోత్సవం

- వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు

వెంకటగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: గ్రామశక్తి పోలేరమ్మ జాతర ఘటోత్సవం వైభవంగా జరిగింది. ఘటోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. కాంపాలెంలోని గాలి గంగమ్మల మండపం వద్ద నుండి ఘటోత్వాన్ని పూజలు నిర్వహించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. పోలేరమ్మ వారికి సమర్పించే చల్ల కొండలను కూడా భక్తుల దర్శనం కోసం ఊరేగించారు. ఘటోత్సవం సందర్భంగా దున్న పోతును పూజించారు. దున్నపోతును, ఘటోత్వాన్ని ఇంటింటికి చెప్పి పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వర రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ పోలేరమ్మ ఆలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఘటోత్సవం

**సామాన్య భక్తులకు దర్శనానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే**

ఈనెల 10,11వ తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు దర్శనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని పోలేరమ్మ గుడి, అమ్మవారిని తయారు చేసే కుమ్మర వీధి, అమ్మవారిని అలంకరించే మండపాలను ఏర్పాటులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వీరిని మాత్రమే వీఐపీలుగా పరిగణిస్తామని, 200, 300 టికెట్లు తీసుకొనిక్యూలో వెళ్లాల్సిందని తెలిపారు. ఆయన వెంట కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఆలయం ఈవో శ్రీనివాసులురెడ్డి, ఏంసి చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు మురళీకృష్ణ, తాండవ చంద్రారెడ్డి, నరసింహులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు ఆనంద్ తదితరులు ఉన్నారు.

## పల్లెలు, పట్టణాల్లో...

# స్థానిక వేడి షురూ

- ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు చేపట్టాలని ఎలక్షన్ కమీషన్ ప్రభుత్వానికి లేఖ ఫలితం

చిత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలు గడువుకు ముందే నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం లేఖ రాయడంలో పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో అప్పుడు స్థానిక 'వేడి' ప్రారంభమైంది. ఎలక్షన్ కమీషన్ రెండు రోజుల క్రితం స్థానిక సంస్థలకు గడువు తీరడానికి 3 నెలలకు ముందు ఎన్నికల నిర్వహణను చేపట్టి పూర్తి చేయడానికి సిద్ధం చేయాలని మున్సిపల్, పంచాయతీరాజ్ కమీషనర్లకు లేఖ రాసిన విషయం తెలిసిందే. జిల్లాలో 2026 మార్చి నాటికి మున్సిపాల్టీలు, పంచాయతీల పాలకవర్గాలకు గడువు తీరనుండగా, ఆగస్టులో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలకు గడువు తీరనుంది. ఎలక్షన్ కమీషన్ గడువుకు తీరడానికి 3 నెలలకు ముందే ఎన్నికల నిర్వహణ చేపట్టి పూర్తి చేయాలని నిర్ణయించి ప్రభుత్వానికి లేఖ రాడంతో గ్రామ, పట్టణాల్లో పంచాయతీ, మున్సిపాల్టీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల ఏర్పాట్లను సిద్ధం చేయాలని లేఖ రాయడం, దీనిపై ప్రభుత్వం నుండి స్పందన ఎలా వున్నప్పటికీ ఎలక్షన్ కమీషన్ స్థానిక సంస్థల ఎన్నికలను శీఘ్రంగా చేపట్టి పూర్తి చేయాలని నిర్ణయించిందని భావిస్తున్న క్షేత్ర స్థాయి నాయకుల్లో ఆనందం విల్లివిరిస్తోంది. జిల్లాలో 31 మండలాలు, నాలుగు మున్సిపాల్టీల పరిధిలో 150కి పైగా కౌన్సిర్ స్థానాలు, 696 గ్రామ పంచాయతీలు, 450కి పైగా ఎంపిటిసీలు, 21 ఎంపిపి స్థానాలు, 21 జడ్పీటిసీ స్థానాలు వున్నాయి.



వీటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే పెద్ద ఎత్తున వివిధ పార్టీల నుండి అభ్యర్థులు పోటీ పడటంతో పాటు పార్టీల అభ్యర్థిత్వం దక్కని వారు స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేయడానికి ప్రయత్నాలు చేస్తారు. అంటే స్థానిక సంస్థల ఎన్నికల ముహుర్తం ఫిక్స్ అయితే ఇప్పటి నుండి పట్టణాలు, పల్లెలు జాతర వాతావరణం నెలకొననుంది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమీషన్ సంసిద్ధత వ్యక్తం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఈ లేఖపై ఎలాంటి స్పందన లేదు. గడువుకు ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అంత తేలిక కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేయాల్సివుండటంతో పాటు జనాభా ప్రాతిపదికగా కొత్త రిజర్వేషన్లు ఖరారు చేయాల్సిన పరిస్థితులు తలెత్తే అవకాశం వుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ఆచీతూచి అడుగులు వేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలక్షన్ కమీషన్ ముందస్తుగా స్పందించడంతో పల్లెలు, పట్టణాల్లో ఎన్నికల్లో పోటీ చేసే నాయకుల్లో మాత్రం హుషారు రేకెత్తించింది.

## పదవి అలంకారం కాదు...

# బాధ్యతను పెంచుతుంది

- కూటమిని తిరుగులేని శక్తిగా తీర్చి దిద్దాలి
- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: రాజకీయ నాయకులకు పదవులు అలంకారం కారాదని ఇది ఒక బాధ్యత పెంచే అంశంగా తాను పరిగణిస్తున్నానని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సరస్వతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాలతో జయరామరావువీధి సందడిగా మారింది. సరస్వతి ఆడిటోరియం బిజెపి కూటమి జెండాలతో కళ కళ లాడింది. పార్టీలకతీతంగా ఏర్పాటు చేసిన సన్మాన సభకు శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళూరుపేట నియోజకవర్గాల నుంచి అభిమానులు భారీ ఎత్తున కదలి వచ్చారు.

**పదవులు శాశ్వతం కాదు... చేసిన సాయం గుర్తుంటుంది: కోలా**

ఈ సన్మాన సభలో కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ మనకు దేవుడు అవకాశం ఇచ్చినపుడు పది మందికి సాయ పడాలన్నారు. అది ఎప్పటికి శాశ్వతంగా ఉంటుందని సాయం పొందిన వారి గుండెల్లో గూడు కట్టుకుంటారని ఆనంద్ అన్నారు. తాను రాజకీయంగా ఎదగటానికి ఎందరో సహకరిస్తున్నారు. వారికి ఎలా తాను రుణ పడి ఉన్నాను. ఇక నియోజకవర్గంలో పలు సమస్యలున్నాయని వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇక తమ వద్దకు ఎవరైనా సమస్యల పరిష్కారానికి వస్తారని వారిని ఆదరించి వారి సమస్యలను పరిష్కరించినపుడు శాశ్వతంగా తమ గుండెల్లో నిలుపు కుంటారని వివరించారు. తనకు పదవి రాగానే ఇంత మంది తనను ఆశీర్వదించటానికి వచ్చారంటే వారికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావటం లేదని కళ్లు చెమర్చుకున్నారు. తాను ఓ మారుమూల శ్రీకాళహస్తిలోఉన్నా నేడు



బిజెపి అభిమానుల సమావేశంలో ప్రసంగిస్తున్న కోలా

కేంద్రంలో ప్రధాని నుంచి బిజెపి నాయకులు ఆదరిస్తున్నారంటే మనం వారితో మనగల్గిన వాతావరణమే అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన మంత్రి ఎన్నో వరాలిస్తున్నారు. నిధులు మంజూరు చేస్తున్నారు. ఈ అంశాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. వక్తలు మాట్లాడుతూ ఎవరు ఆనంద్ వద్ద తనకు ఈ సమస్య అంటూ వెళితే వెంటనే స్పందించే నాయకుడు అన్నారు. కాగా పార్టీలతో ప్రమేయం లేకుండా ఎవరు వెళ్ళినా ఆప్యాయతగా పలకరించే నాయకుడు ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్‌ను దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సభలో కార్యక్రమాల్లో జనసేన కు చెందిన గరికపాటి చంద్ర, జిల్లా అధ్యక్షులుసామంచి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషేధ రాజు, చిత్తూరుచిట్టిబాబు తెలుగుదేశం నాయకులు మునిరాజా యాదవ్, కాసరం రమేస్, వజ్రం కిషోర్, గుర్రప్ప శెట్టి, సుబ్బయ్య, విజయకుమార్, కెట్టేసాయి, బిజెపి పదాదికారులు, మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు సత్కరించారు.

## ఎస్సీ..ఎస్టీ కుటుంబాలకు...

# ఉచిత సౌర వెలుగులు

- కుప్పంలో 9వేల దాకా కుటుంబాలకు లబ్ది -నడిమూరులో 'సోలార్' సక్సెస్ !



సోలార్ రూఫ్‌టాప్‌లు

కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈ ఏడాది జనవరి నెలలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలో ఉన్న అన్ని గృహాలకు సూర్యఘర్ పథకంలో భాగంగా రాయితీతో సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటుకు నిర్ణయించారు. నియోజక వర్గంలో దాదాపు 55వేలకు పైబడి గృహాలు ఉన్నాయి. వీటంతటికీ ఎపిఎస్‌పిడిసిఎల్, కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) అధ్వర్యంలో సోలరైజేషన్ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

**ఎస్సీ..ఎస్టీ కుటుంబాలకు ఉచితం :**

పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో దాదాపు తొమ్మిది వేల ఎస్సీ,ఎస్టీ కుటుంబాలను గుర్తించి లబ్దిదారులుగా ఎంపిక చేశారు. రెస్కో పరిధిలో వచ్చే వి.కోట మండలంలోని కొన్ని ప్రాంతాలు కలుపుకుంటే ఈ సంఖ్య పదివేలకు చేరే అవకాశం ఉంది. కాగా నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు చెందిన సుమారు 7500 గృహాలకు ఇళ్లపైకప్పు (రూఫ్‌టాప్) ఉందని రెస్కో అధికారులు గుర్తించారు. మిగతా సుమారు 1500వేల మందికి దాదాపు 3.5లేదా 4 మెగావాట్ల సోలార్ గ్రిడ్‌లను ఏర్పాటుచేసి వాటి ద్వారా సౌర విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు.

## పరివార దేవతలకు పవిత్రాలు...

# ఆలయాధికారులకు ఆశీర్వచనం



కలశాల ఊరేగింపులో ఇఓ తదితరులు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు, ఆదివారం పౌర్ణమి సందర్భంగా ముగిసాయి. ఐదు రోజుల పాటు స్థానిక సంప్రదాయం మేరకు యాగశాల ఏర్పాటు ప్రతి రోజూ పవిత్రాల దర్శనం నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో భక్తి భావంతో పాటు వేదమంత్రాల ఘోషతో పునీతమైంది. ఉదయం యాగశాలలో నుంచి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అలంకార మండపం నుంచి పవిత్రాలను, పూజా సామగ్రిని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు ఆలయ వేదపండితులు, అధికారులు ప్రాకారంలో ఉత్సవంగా నిర్వహించారు. తరువాత ఆకాశ వినాయకుని ఆలయం నుంచి పరివార దేవతలకు పవిత్రాలను సమర్పించారు. యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలను ఉద్వాసన గావించారు. కలశాలను ప్రాకారోత్సవం నిర్వహించారు. యాగశాల వద్ద హోమాలు నిర్వహించారు. ఇక్కడ పూజలు నిర్వహిస్తూ మొదట ఆలయాధికారి డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులకు పవిత్రాలను అలంకరింప జేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు, టెంపుల్ సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.

## శాస్త్రోక్తంగా పద్మావతి అమ్మవారి...

# పవిత్రాలు సమర్పణ

- నేడు పద్మావతి పుష్కరణలో చక్రస్నానం
- చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఆలయం మూసివేత





తిరుచానూరు, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రసమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. తరువాత పవిత్ర సమర్పణ చేశారు. ఇందులో అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉప ఆలయాలకు, పరివార దేవతలకు, విమానప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. అనంతరం సాయంత్రం యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన, తీర్థప్రసాద గోష్టి తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమంలో భాగంగా ఆదివారం చక్రస్నానం నిర్వహించనున్నారు. పూర్ణాహుతి వైదిక కార్యక్రమాల అనంతరం చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం రెండు గంటల 15 నిమిషాలకి ఆలయం మూసి వేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేశ్, ప్రసాద్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్, ఎవియస్‌ఓ రాధాకృష్ణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

# కట్టెదురా వైకుంఠం...!

**శోభాయమానం బ్రహ్మోత్సవ వైభవం -కలియుగవైకుంఠంగా మిరుమిట్లుగొలుపుతున్న విద్యుద్దీపాల స్వాగత ఆర్చిలు**







తిరుమల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల సప్తగిరులు కలియుగవైకుంఠంగా విరాజిల్లుతోంది. మరో రెండువారాల్లో మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం పరిసరాలు సిద్ధమవుతున్నాయి. శనివారం రాత్రి తిరుమల ఆలయానికి ముఖ్యద్వారమైన రాంభగీచా అతిధిగృహాల ప్రాంతంలో సప్తలోకాలకు ప్రతీకగా విద్యుద్దీప తోరణాలను ఏర్పాటుచేశారు. స్వర్ణరథమండపం భవనంపై దశావతారాలు ఎంతో ఆకట్టుకునేలా చక్కగా తీర్చిదిద్దారు. ఇక తిరుమలేశుని ఆలయంపైభాగాన శంఖుచక్రనామాలకు ఇరువైపులా గజరాజులుస్వాగతం పలికే తీర్చిదిద్దిన విద్యుద్దీపాలు మరింత ఆకట్టుకోనున్నాయి. ఇప్పటికే తిరుమలలో పూర్తిగా కలియుగవైకుంఠంలో ఉన్నామనే అనుభూతి కలిగేలా మార్చేశారు. మాఢవీధులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

## మధ్యాహ్నమే ...

# ప్రధాన ఆలయాల మూత!

**నేటి వేకువజామున తిరిగి తెరచుకోనున్న తలుపులు**





చంద్రగ్రహణంతో తిరుమల ఆలయం, పద్మావతిఅమ్మవారి ఆలయం, గోవిందరాజుని ఆలయం, కోదండరామస్వామి ఆలయాల మూత

తిరుమల, సెప్టెంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి: సంపూర్ణ చంద్రగ్రహణం ప్రభావంతో గ్రహణ సమయానికి కొన్ని గంటల ముందు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతో బాటు తిరుపతి పరిసరాల్లోని అన్ని ప్రధాన ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం మూతబడ్డాయి. తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, సూర్య నారాయణ స్వామి ఆలయం, అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, వకుళమాత ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, కార్వేటినగరం వేణుగోపాల స్వామి ఆలయం ఇలా ప్రధానఆలయాల తలుపులను అధికారులు ఆదివారం మధ్యాహ్నం 2.30-3గంటలకు మూసివేశారు. తిరుమలలో మధ్యాహ్నం వరకు క్యూలైన్లలో ఉన్న భక్తులందరినీ త్వరగా ఆలయంలోనికి అనుమతించి వెంకన్న దర్శనం చేయించారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓలోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పర్యవేక్షణలో 3.30గంటలకు బంగారువాకిలి తలుపులు, వెండివాకిలి, మహద్వారం తలుపులను మూసివేసి అర్చకులు వరుసగా తాళాలు వేశారు. సోమవారం వేకువజామున తిరిగి ఆలయాలన్నీ తెరచుకోనున్నాయి. ఉదయం 7గంటలనుండి భక్తులకు ఆయా ఆలయాల్లో తిరిగి దర్శనాలను పునరుద్ధరిస్తారు.

# క్రీడాంధ్రప్రదేశ్...ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే ఆరణి




తిరుపతి క్రీడ, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా తల్లితండ్రులు ప్రోత్సాహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. క్రీడాకారులకు భరోసా కల్పించేలా ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను రెండు నుంచి మూడు శాతానికి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌లు పెంచారని ఆయన చెప్పారు. బడి వరలక్ష్మీ మెమోరియల్ మూడవ స్టేట్ లెవల్ టేబుల్ టెన్నీస్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నానీలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తన తల్లి జ్ఞానపకార్థం బడి సుధాయాదవ్ అండర్ 11,13,15 ఏళ్ళ గర్ల్స్ అండ్ బాయ్స్ టేబుల్ టెన్నీస్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా 110 జట్లు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవి నాయుడులు ఒక జట్టుగా, ఎమ్మెల్యే పులివర్తి నానీ, బడి సుధా యాదవ్‌లు ఒక జట్టుగా టెబుల్ టెన్నీస్ కొద్ది సేపు ఆడారు. రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన చెప్పారు. తన తల్లి జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా టేబుల్ టెన్నీస్ అధ్యక్షులు బడి సుధాయాదవ్ తెలిపారు. రాజకీయాలతో పాటు క్రీడల్లోనూ తన వంతు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. డిఎస్ డిఓ శశిధర్, ఎన్డీఏ నాయకులు ఈశ్వర్ రెడ్డి, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే మంచి ఫలితం : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: పార్టీ కోసం ఎవరైతే కష్టపడి పనిచేస్తారో వారికి మంచి పదవులు, పార్టీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఎఎంసి ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆకుతోట రమేష్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బొమ్మన శ్రీధర్‌లకు స్థానిక ఎస్‌కెఎస్ కల్యాణ మండపంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పార్టీలో గుర్తింపు కోసం ప్రస్తుతం పదవులు వచ్చిన వారు కష్టపడ్డారని, వారికి తగిన గుర్తింపు లభించిందని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ సూళ్లూరుపేట పట్టణంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా పనిచేస్తూ శాసనసభ ఎన్నికల్లో సుమారు పదివేల ఆధిక్యతను తీసుకురావడంలో ఎంతో కృషి చేసిన ఆకుతోట రమేష్‌ను అభినందించారు. బొమ్మన శ్రీధర్ రాష్ట్రస్థాయిలో మంచి పదవి దక్కించుకోవడం పార్టీకి క్రమశిక్షణగా పనిచేయడమేనని చెప్పారు. రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ పదవులు చేపట్టిన ఆకుతోట రమేష్, బొమ్మన శ్రీధర్‌లు పార్టీ కోసం కష్టపడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పనిచేసి పార్టీకి తిరుగులేని ఆధిక్యతను నియోజకవర్గంలో తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, మాధవనాయుడు, బొమ్మన పళణి, పేరం శ్రీరాంప్రసాద్, కందల కృష్ణారెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని కూటమి నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## రేపు పలమనేరులో అన్నదాతపోరు

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన పలమనేరులో ఈనెల 9వ తేదీన పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అన్నదాతపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దపంజాణి మండల వైకాపా కన్వీనర్ బాగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడులు హాజరౌతున్నారన్నారు.

## నేటి నుంచి రైతులకు యూరియా పంపిణీ

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆదేశాలమేరకు మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో సోమవారం నుంచి రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారిని రఖీభా తెలిపారు. శంకర్రాయలపేట, రాజుపల్లి, బట్టందొడ్డి, తుర్లపల్లి, కొలత్తూరు, లింగాపురం, పెద్దపంజాణి ఆర్ఎస్‌కేల్లో సోమవారం యూరియా పంపిణీ చేస్తామన్నారు. మంగళవారం వీరప్పల్లి, నాగిరెడ్డిపల్లి, పెద్దకాప్పల్లి ఆర్ఎస్‌కేల్లో అందిస్తామన్నారు. యూరియా అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, మొబైల్ ఫోన్ తప్పక తీసుకురావాలని ఆమెకోరారు.



## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక: కలెక్టర్

**చిత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## గ్రావెల్ మాఫియా దందా

**పాలసముద్రం సెప్టెంబర్ 7 :ప్రభాతవార్త**

:పాలసముద్రం మండలంలో గతంలో ఎన్నడు లేని విధంగా విచ్చలవిడిగా పుట్టగొడుగుల్ల పుట్టుకొచ్చిన గ్రావెల్ క్వారీలు ఈ క్వారీలకు అనుమతులు ఉన్నాయా లేదా అన్నది ప్రజల సందేహం ఈ సందేహాన్ని నివృతం చెయ్యవలసింది అధికారులు. అలాంటి అధికారులు ఏదైనా పత్రికల్లో గ్రావెల్ అక్రమ రవాణా గురించి ప్రచురించిన రోజు హడావిడి చేస్తారు మరల నిమ్మకి నీరెత్తినట్టే. ఈ క్వారీలు ప్రభుత్వ అనుమతితో నడుస్తున్నాయా లేక నాయకుల అండతో నడుస్తున్నాయి అని ప్రజలు గుసగుసలాడుతున్నారు. గత కొన్ని రోజులకు ముందు ఈ మాఫియాను నమ్మి కొంతమంది వాహనదారులు వచ్చి గ్రావెల్ నింపుకొని వస్తుండగా సంబంధిత అధికారులు తనిఖీ చేయగా వారు ఇచ్చిన బిల్లు తప్పుడు బిల్లు అని చెప్పి సుమారు 6 టిప్పర్ల ను సీజ్ చేశారు. ఒక్కొక్క టిప్పర్ యజమాని కి సుమారు 65 వేల రూపాయలు జరిమానా విధించారు. గ్రావెల్ క్వారీ యజమానులు వారు ఇటు ప్రభుత్వాన్ని అటు టిప్పర్ యజమానులను మోసం చేశారు. దొరికితే దొంగ దొరకపోతే దొర అనే విధంగా గ్రావెల్ మాఫియా ఇష్టా రాజ్యాంగ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. విచ్చలవిడిగా ఆంధ్ర సంపదను తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇకనైనా సంబంధిత జిల్లాస్థాయి అధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

## 19 నుండి ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్.

**తిరుపతి విద్య సెప్టెంబర్ 7 ప్రభాత వార్త:**

షాపింగ్ పరంగా సౌలభ్యంకు సంబంధించిన అపూర్వమైన వేడుకలో భాగంగా వాణిజ్య వేదిక అయిన ఇన్‌స్టామార్ట్, తమ ప్రారంభ వార్షిక మెగా సేల్, ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025ఖి ను ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మహేష్ తెలిపారు. ఈ అమ్మకం, కొనుగోలుదారులకు వేగవంతమైన డెలివరీతో పాటుగా ఉత్తేజకరమైన ఆఫర్‌లను సైతం అందిస్తుంది, ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా షాపింగ్ అనుభవాలను సృష్టిస్తోంది. ఈ సేల్ సెప్టెంబర్ 19 నుండి28 వరకు ఇన్‌స్టామార్ట్ యాప్, స్విగ్గీ యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉండనుంది. ఈ సేల్ కాలంలో కస్టమర్లు 50-90% తగ్గింపుతో భారీ రాయితీలను ఆశించవచ్చు, ఎలక్ట్రానిక్స్, కిచెన్ , డైనింగ్, బ్యూటీ , పర్సనల్ కేర్, బొమ్మలు, మరిన్ని విభాగాలలో గణనీయమైన తగ్గింపులను సైతం పొందవచ్చన్నారు. ఇవన్నీ కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేయబడతాయి. 50,000 కంటే ఎక్కువ ఉత్పత్తులతో, ఈ సీజన్ అతిపెద్ద ఆఫర్‌లకు త్వరిత వాణిజ్యం వేగం, సౌలభ్యాన్ని తీసుకురావడం ద్వారా ఇన్‌స్టామార్ట్ పండుగ షాపింగ్‌ను పునరావిష్కరిస్తోందని తెలిపారు.

## మారండయ్యా బాబు....హెల్మెట్లు ధరించండి.... అర్బన్ సిఐ.



**రేణిగుంట సెప్టెంబర్7ప్రభాతవార్త.** మారండయ్యా బాబు హెల్మెట్లు ధరించి ప్రాణాలు కాపాడుకోండని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ద్విచక్ర వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ జయచంద్ర తమ సిబ్బందితో రేణిగుంట పట్టణంలోని వివిధ కూడళ్ల వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. పలువురు వాహన చోదకులు హెల్మెట్లు లేకుండా వాహనాలు నడపడం గమనించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఫైన్ లు వేశారు. వాహన రికార్డులను, డ్రైవింగ్ లైసెన్సులను, నేమ్ ప్లేట్లను, ఇన్సూరెన్సును, పొల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. వాహనాల రికార్డులు సరిగా లేని వారికి జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. పెద్ద పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లు వాహనాలకు అమర్చుకోరాదన్నారు. భారీ,విచిత్ర మైన శబ్దాలు చేసే హారన్లు వాహనాలకు బిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సాయంత్రం అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్సై నాగరాజు, ట్రైనీ ఎస్సై స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

## సెలవు దినం నాడు వాటం చూసి అక్రమ నిర్మాణం...

**.రేణిగుంట సెప్టెంబర్ 6ప్రభాతవా ర్త**



రేణిగుంట పట్టణం పాంచాలి నగర్ నందు ప్రభుత్వ స్థలంలో ఆదివారం సెలవు దినం కావడంతో అధికారుల కళ్ళు కప్పి అక్రమంగా ఇంటి నిర్మాణానికి పాల్పడ్డాడు. సదరు ఇంటి యజమానికి ప్రభుత్వ స్థలాన్ని ఫేక్ సర్వే నంబర్ వేసి ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించి రిజిస్టర్ చేసుకుని కొద్దిరోజుల క్రితం అక్రమ నిర్మాణానికి పాల్పడ్డారు. స్థానికులు వాహనాలకు ఇబ్బంది కలిగిస్తూ రోడ్డును ఇరుకు చేస్తున్నారని అడ్డుకోవడం జరిగింది. విషయం తెలుసుకున్న రెవిన్యూ అధికారులు అక్కడకు చేరుకొని నిర్మాణాన్ని నిలిపివేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టకూడదని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. దీంతో నిర్మాణాన్ని నిలిపివేశారు. ఆదివారం సెలవు దినాన్ని అదనుగా చేసుకొని మరల నిర్మాణానికి పాల్పడ్డారు. ఈ విషయంపై తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ప్రభాతవార్త ప్రతినిధికి వివరణ ఇస్తూ సోమవారం నిర్మాణాన్ని నిలిపివేస్తామన్నారు. ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఎంత పెద్ద కట్టడం నిర్మాణం చేసినా జెసిబి తో తొలగించేస్తామని చెప్పారు. అప్పటికి ఆక్రమణదారులు ఆదేశాలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తామన్నారు.

## ఖాకీ యూనిఫాం వేసుకున్న కరుణామూర్తులు.

**.. రేణిగుంట సెప్టెంబర్ 7ప్రభాతవా ర్త**



ఖాకీ బట్టల వెనక అపారమైన కరుణ దాగుందని రేణిగుంట అర్బన్ పోలీసులు నిరూపించారు. రేణిగుంట మండలం గుత్తి వారి పల్లె గ్రామంలో గత వారం రోజులుగా సుమారు 40 మంది గ్రామస్తులకు డయేరియా వ్యాధి సోకి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇద్దరు డయేరియా సోకి ప్రాణాలు కోల్పోయారు. గ్రామంలో నీరు కలుషితం కావడం, పారిశుధ్య లోపం వల్ల డయేరియా సోకిందని ప్రచారాలు ఊపందుకున్నాయి. గ్రామంలోని ప్రతి ఇంటికి ప్రతిరోజు మినరల్ వాటర్ క్యాన్లు ఇవ్వాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రేణిగుంట అర్బన్ పోలీసులు ముందంజలో ఉన్నారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ జయచంద్ర నేతృత్వంలో అర్బన్ ఎస్సై నాగరాజు, ట్రైనీ ఎస్సై స్వాతి, తమ సిబ్బందితో శనివారం ఆరు మినరల్ వాటర్ ట్యాంకర్లను గ్రామానికి పంపారు. ఆదివారం ఉదయం మరికొన్ని మినరల్ వాటర్ ట్యాంకర్లతో పోలీసులు వెళ్లి ఇంటింటికి సరఫరా చేసి మానవత్వం చాటుకోవడంలో ముందంజలో ఉన్నారు. డయేరియా వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు గ్రామానికి తరచూ మినరల్ వాటర్ సరఫరా చేస్తామని సీఐ జయచంద్ర ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు.

## రైతుకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ

– వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

**చిత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా సోమవారం నుండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ జెడి మురళీకృష్ణను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. దీనికోసం రెవెన్యూ, పోలీసు శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాట్లు, టోకెన్ల పంపిణీ తదితరాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎరువుల కొనుగోలు కోసం సొసైటీలకు వచ్చే రైతులు ఎండ తీవ్రతకు ఇబ్బంది పడకుండా వుండటానికి షామియానాలు, కుర్చీలు వేయించి మంచినీరు సరఫరా చేయాలన్నారు.

## ప్రతి ఊర్లో వైకాపాకు నాయకుడు : వజ్ర భాస్కర్‌రెడ్డి



**చౌడేపల్లి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ వైకాపాకు నాయకుడిని తయారు చేయడమే ముఖ్య లక్ష్యంగా పనిచేసి పుంగనూరును రాష్ట్ర పార్టీకే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు వజ్ర భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైసాని కళ్యాణ మండపంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. వార్డు స్థాయి నుంచి కమిటీల నియామకాల్లో అందరి భాగస్వామ్యం వుండాలన్నారు. ప్రతి కమిటీలోనూ అన్ని రకాల వ్యక్తులుండాలన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల నాయకత్వంలో గ్రామ కమిటీలను మరింత బలోపేతం చేసి, వైకాపాకు సైన్యాన్ని తయారు చేసుకోవాలన్నారు. వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, ఉపాధ్యక్షుడు నడింపల్లి దామోధర్‌రాజు, మండలపార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, రాష్ట్ర నాయకులు మిద్దింటి కిషోర్, కళ్యాణ్‌భరత్, మండల ఉపాధ్యక్షులు నరసింహులయాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, వెంకట్రెడ్డి, జయసుదమ్మ, రవిచంద్రారెడ్డి, చెంగారెడ్డి, నాయకులు పవన్‌రాయల్, హరీష్‌రాయల్, రాంకీ, భాస్కర్, శ్రీరాములు, అనుప్రియ, షంషీర్‌భాషా, షఫీ, రాంబాబు శ్రీనివాసులు, శేషు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి యూరియా పంపిణీ

**చౌడేపల్లి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** మండలంలో ఈనెల 8నుంచి యూరియా పంపిణీ చేపట్టనున్నట్లు వ్యవసాయాధికారి మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోగల 12రైతు సేవాకేంద్రాల్లోనూ పంపిణీ జరుగుతుందన్నారు. ఆయా రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డులను తీసుకెళ్ళి ఒక్క బస్తామాత్రమే తీసుకోవాలన్నారు.



## వాల్మీకుల జీవితాలలో వెలుగులు నింపాలి



**పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** తరతరాల నుంచి దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్న బోయ వాల్మీకుల కుటుంబాలలో ప్రభుత్వం ఎస్టీరిజర్వేషన్ తో వెలుగులు నింపాలని రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు తిరుపతి జిల్లాల వాల్మీకి సంఘాల నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముడెప్ప సర్కిల్ వద్ద వాల్మీకి విగ్రహానికి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినప్పటికీ వాల్మీకులకు న్యాయం జరగలేదన్నారు. గతంలో రాష్ట్రంలో ఉన్న వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ ను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు వాల్మీకుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని దీని కారణంగానే గత ప్రభుత్వం కుప్పకూలిపోయిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పై ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట అమల్లోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీలు బీసీలు మొత్తం ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం అవుతుంటే వాల్మీకులకు మాత్రం న్యాయం జరగక దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన చెందారు. అనంతరం పట్టణంలోని బిఎంఎస్ క్లబ్లో జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల బోయ వాల్మీకి సంఘాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల్ల ష్ఠరిష్కార వేదిక : కడ పి.డి



**కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి నేరుగా వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు.

## ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన నేతలు

**పుంగనూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త** ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం మధ్యంతర బెయిల్ పై విడుదలైన ఎంపీ మిధున్ రెడ్డిని పుంగనూరు వైకాపా నేతలు ఆదివారం హైదరాబాద్ లో కలిశారు. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఆదివారం ఉదయం విడుదలైన ఎంపీ మిథున్‌రెడ్డిని పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జిల్లా వైకాపా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ స్థితిగతులపై మిధున్ రెడ్డి అర తీసినట్టు తెలిసింది. పుంగనూరు నుంచి పెద్ద ఎత్తున వైకాపా నాయకులు ఎంపీ మిథున్ రెడ్డిని కలిసేందుకు సోమవారం తిరుపతికి తరలి వెళ్తున్నారు.

## టీడీపీ దళితుల ఆత్మీయ సదస్సు



**పూతలపట్టు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** పూతలపట్టు మండల తెలుగుదేశం పార్టీ దళితుల ఆత్మీయ సమావేశం మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు సుబ్బరాజులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్బరాజులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేసిన వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి అనగల్లు మునిరత్నం మాట్లాడుతూ ప్రస్తుతం మన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పార్టీ కోసం కష్టపడ్డ దళితులకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించామని అన్నారు. తెలుగుదేశం పార్టీ దళితులను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకుండా, వారికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు నడుస్తోందని మాజీ యం.పి.టి.సి రమేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు వీరభద్రయ్య, తవనంపల్లి మండల మాజీ ఉపాధ్యక్షుడు నటరాజ్, పూతలపట్టు మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బాబు, టీడీపీ నాయకులు ఎత్తురాజులు కృష్ణయ్య, ముత్తు, రమేష్, పూర్ణ, చెంగ్రాలయలు, శరత్ బాబు, భాస్కర్, పాల్యం మురళీ, సుబ్రమణ్యం, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాగరాజ, బి.సి నాయకులు నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహేష్‌సేరో జన్మదిన వేడుకలు

**తవణంపల్లి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** జనసేన పార్టీ జిల్లా నాయకుడు మహేస్ సేరో జన్మదిన వేడుకలను మండలంలోని అరగొండలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేష్‌సేరో అభిమానుల నడుమ స్థానిక కొత్త బస్టాండ్‌లో మహేస్‌సేరో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనను పలువురు దుశ్శాలువులతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు చిన్నా(వెంకటేశ్వర్లు), మోహన్‌బాబు, అజిత్, యువరాజ్‌లతో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## మల్లప్పకొండపై ప్రత్యేక హోమాలు.. రుద్రాక్షల పంపిణీ



**గుడుపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** మండలంలోని మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈస ందర్భంగా తిరుపతికి చెందిన రుద్రాక్షల నిపుణులు విజయ్ కుమార్ భక్తులకు రుద్రాక్షలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎం పిఏ మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్ జిమ్‌దాము, తెదేపా నేతలు జిఎం సుధీర్, యశ్వంత్, కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

## వాల్మీకి సంఘంచే ఆర్థిక సాయం

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** మండలంలోని బెరబల్లి గ్రామానికి చెందిన రామస్వామి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం బాధిత కుటుంబాన్ని వాల్మీకి సేవాసంఘం తరుపున ఆదుకున్నారు. పెద్దపంజాణి వాల్మీకి సేవాసంఘం తరుపున రామస్వామి కుటుంబానికి 30వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎల్ భాస్కర్, మండల అధ్యక్షులు మాడి శంకరప్ప, కోశాధికారి డా॥ సుబ్రమణ్యం, వీరప్పల్లి బాబు, మాజీ సర్పంచ్ చలపతి, పెద్దారికుంట మాజీ సర్పంచ్ ఓ.గంగప్ప, పొట్టగానిపల్లి నగేష్, రామక్రిష్ణ, శ్రీనివాసులు, భాస్కర్, ప్రభాకర్, మునిరెడ్డి, గుర్రప్ప, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకంలో నేడు (సోమవారం)

పగలు : అభిషేకం రాత్రి : యాళివాహనసేవ

ఉభయదారులు : శ్రీ ఎ.నరసింహారెడ్డి అండ్ సన్స్, అగరంపల్లె, శ్రీపి.సుబ్బారెడ్డి అండ్ సన్స్, చినకాంపల్లె, దేవస్థానం వారిచే.

స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు మిట్ట లక్ష్మీ చిత్తూరు వారిచే ప్రవచనము, 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గోదా నాగమణి, తిరువూరు, 12 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎం.నారాయణరెడ్డి, పొదలకూరు, 1 గంటల నుండి 2 గంటల వరకు వి.సుధాకరన్ వారిచే భక్తిరంజని, 2 గంటల నుండి 3 గంటల వరకు కె.హారిక, ఎం.హేమావతి వారిచే కూచిపూడి, భరతనాట్యం, 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్.ఉషారాణి భాగవతారిణిచే హరికథ, 5 గంల నుండి 6 గంటల వరకు టి.శేఖర్, గుంటూరు, 6 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు శ్రీనివాసన్ శ్రీధరన్ ఆచార్య, చెన్నై, 7 గంటల నుండి 8 గంటల వరకు పి.సంధ్య, శివనాట్య కళానిలయం తిరుపతి, 8 గంటల నుండి 9 గంటల వరకు అను డ్యాన్స్ అకాడమి, గుంటూరు వారిచే కూచిపూడి, భరతనాట్యం, 9 గంటల నుండి 11 గంటల వరకు సీమెచ్, వెంకటేశ్వర్లు, నెల్లూరు, 11 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు సి.ఆనంద్, శ్రీకాళహస్తి వారిచే పౌరాణిక నాటక ప్రదర్శనలు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## వరసిద్దుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ



**కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆదివారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆయన కాణిపాకంలో అయ్యప్పస్వామి మాల దీక్ష తీసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.ఎమ్మెల్యే వెంట ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు,ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం

**కాణిపాకం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో ఆదివారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా సంపూర్ణ చంద్రగ్రహణ సందర్భంగా రాత్రి ఆలయంలో జరగాల్సిన పున్నమి గరుడసేవ రద్దయింది.

## అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు



**తవణంపల్లె, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనే యస్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## చంద్రగ్రహణంతో కాణిపాకం ఆలయం మూసివేత



**కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయాన్ని ఆదివారం మూసివేశారు. రాత్రి 9.57 గంటల నుండి అర్ధరాత్రి 1,26 గంటల వరకు చంద్రగ్రహణం సంభవిస్తున్నందున సాయంత్రం 4గంటలకు ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం 4 గంటలకు ఆలయశుద్ధి, పుణ్యాహా వాచనం, స్వామివారి మూలవిరాట్‌కు గ్రహణ అభిషేకం నిర్వహించిన అనంతరం ఉదయం 6గంటల నుండి భక్తులకు దర్శనం వుంటుందని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు.

**అర్ధగిరిలో.....**

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంను ఆదివారం మూసివేశారు. ఈమేరకు సాయంత్రం 4గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించిన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 4 గంటలకు ఆలయశుద్ధి, సంప్రోక్షణ,స్వామివారికి గ్రహణ అభిషేకం నిర్వహించిన అనంతరం ఉదయం 6 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమవు తుందని ఆలయ అధికారులు తెలిపారు.

## ప్రజల ఆరోగ్య భద్రతకు యూనివర్సల్ హెల్త్ పాలసీ భరోసా

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్



**చిత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** క్యాబినెట్ ఆమోదించిన యూనివర్సల్ హెల్త్ పాలసీ ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తోందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకు మార్ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాటాడుతూ రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీని భ్రష్టు పట్టించడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యక్తి ఆసుపత్రిలో చేరిన 6 గంటల్లోనే చికిత్సకు అనుమతి లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు యూరియా పంపిణీ

**యాదమరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** యాదమరి మండలంలోని 184 గొల్లపల్లి, బోదగుట్టపల్లి రైతు సేవా కేంద్రాల్లో సోమవారం యూరియా పంపిణీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి దీప తెలిపారు. యూరియా అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డులు, పట్టాదార్ పాసుపుస్తకాలను తీసుకెళ్ళి యూరియా కొనుగోలు చేసుకోవచ్చునన్నారు.

## నేడు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరిం చడానికి సోమవారం నుండి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీ మణికంఠ చందోలు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చును.

## నేడు కలెక్టరేట్ ఎదుట ముస్లీంల నిరసన

**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** కలెక్టరేట్ ఎదుట మసీదుల ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనంను సత్వరం చెల్లించాలని డిమాండ్ చేస్తూ చిత్తూరులోని ముస్లీంలు సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమంను నిర్వహించనున్నారు. గత ప్రభుత్వం మసీదుల్లోని ఇమామ్, మౌజన్‌లకు ప్రతి నెల గౌరవ వేతనం చెల్లిస్తుండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది నుండి మసీదుల్లో విధులు నిర్వహించే ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇవ్వడం లేదు. దీనిపై ముస్లీం ఇమామ్‌లు, మౌజన్‌లు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నారు.

## చెరువులో లభ్యమైన యువన్ మృతదేహం!



**కుప్పం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధి పరమసముద్రం చెరువులో ఈత కొడుతూ యువన్ శంకర్ (17) అనే బాలుడు చెరువు నీటిలో ఈనెల 5వ తేది గల్లంతైన విషయం విదితమే. ఆదివారం ఉదయం యువన్ ఆచూకీ చెరువులో తెలియడంతో పాటు మృతదేహం లభ్యం కావడంతో ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. పరమసము ద్ర ంకు చెందిన వెంకటేష్ కుమారుడు ఐటిఐ చదువుతున్న యువన్ తన ఇద్దరు స్నేహితులు అయిన రవీంద్ర, చం ద్రన్‌లతో కలసి 5వ తేది చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. రెండు రోజుల పాటు అటు పోలీసు యంత్రాంగం, ఇటు ఫైర్ సిబ్బంది, తమిళనాడు ఎన్‌డిఆర్ఎఫ్ దళాలు యువన్ ఆచూకీ కోసం చెరువును జల్లెడ పట్టాయి. కాగా యువన్ మృతదేహం లభ్యం కావడంతో వారి తల్లిదండ్రులు, కుటుంబీకులు పరమసము ద్రం చెరువు వద్ద చేసిన రోదనలు మిన్నంటాయి. పెద్ద ఎత్తున గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకుని వారిని ఓదార్చసాగారు. మృతదేహాన్ని పంచానామా నిర్వహించిన అనంతరం పోలీసు అధికారులు యువన్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కాగా యువన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బ్యాంక్ ఆఫ్ ఇండియా 121 వార్షికోత్సవ సంబరాలు



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆదివారం ఖాతాదారులు, సిబ్బంది కలసి సంబరాలు జరుపుకున్నారు. 121వ వార్షికోత్సవంను అలాగే శ్రీకాళహస్తిలో బ్రాంచి ఏర్పాటు చేసి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు ఏర్పాటు చేసారు. బ్రాంచి మేనేజర్ నరసింహారెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో ఆయన కేక్ కట్ చేసి బ్యాంకు సాధించిన ప్రగతిని అందిస్తున్న సదుపాయాలను, ఖాతాదారులు సహకారాన్ని వివరించారు. నేడు మనం సంబరాలు జరుపుకుంటున్నామంటే అది మీ అందరి సహకారమే అని మేనేజర్ నరసింహారెడ్డి అన్నారు. సమావేశంలో సిబ్బంది లీనా,మౌనిక, ఉమా,శ్రీనివాసులు, మోహన్,విజయ్, నాగ, వినోద్,సతీష్,బియస్ఏ హేమకుమార్‌లు ఎపాల్గొన్నారు.

## తలారి కనబడుట లేదు

**తొట్టంబేడు,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



తొట్టంబేడు మండలం పొయ్య గ్రామానికి చెందిన గంధం ఆదిలక్ష్మి(42) మండల పరిషత్ కార్యాలయంలో తలారిగా పని చేస్తూ కుటుంబ పోషణలో సహకరిస్తుంది. అయితే ఇంటిలో గొడవలతో సతమతమౌతూ మానసిక వేదనకు గురౌతుంది.శనివారం ఉదయం యథతథంగా విధుల నిర్వహణకు ఇంటి నుంచి బయలు దేరినట్లు ఆమె కుమారుడు గంధం సునీల్ కుమార్ తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవటంతో బంధువుల ఇళ్ళ వద్ద వెతికినట్లు వివరించారు. అయితే ప్రయోజనం లేదని తెలిసిన వాళ్ళ ఇళ్ళలో కూడా విచారించామని కానీ ఆచూకి తెలియలేదని తెలిపారు.

## పరశురామేశ్వరాలయం హుండీల లెక్కింపు:

**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయంలో భక్తులు నెల రోజుల పాటు సమర్పించిన హుండీ కానుకలను లెక్కించగా రూ.2లక్షల23వేల 121లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి ఆదివారంఒ ప్రకటనలో వెల్లడించారు. గతంలో సరైన రోడ్డు,రవాణా సౌకర్యాల్లేక ఆలయానికి భక్తులు వచ్చే వారు కాదని ప్రస్తుతం తిరుపతి నుంచి బస్సులు ఏర్పాటు చేయటంతో భక్తులతో పాటు రోడ్డు బాగుపడటంతో వివిపిలు కకూడా వస్తున్నారని ఇఓ వివరించారు. అన్నదానాలకు కూడా రూ.30వేల 98లు వచ్చినట్లు ఆయన వివరించారు.

## మన పర్యావరణం మన బాధ్యత

**తొట్టంబేడు,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా ఆయన పిలుపు మేరకు శ్రీకాళహస్తికి చెందిన జనసైనికులు ఆచరించారు. ఆదివారం పేట బ్రదర్స్ సారధ్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.పవన్ కళ్యాణ్ ప్రతి నెల మొదటి, మూడవ శనివారాల్లో మన పర్యావరణం-మన బాధ్యత కార్యక్రమాలను నిర్వహించుటకు ఆదేశించారు. ఈ నేపధ్యంలో తాము చేపట్టినట్లు పేట బ్రదర్స్ వివరించారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. మండల జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, దినేష్, మహేష్, మణి, నవీన్,రాజేష్,రెడ్డి కల్లిపూడి వెంకటేశ్,సాయి,వెంకటేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టిటిఇ కంపెనీ సిఎస్‌ఓపై కేసు నమోదు చేయాలి!

**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



ఏర్పేడు మండలంలోని వికృతమాలలో వెలసిన కంపెనీల్లో మేనేజ్‌మెంట్లు అధికారులు కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడుతున్నారని సిపిఐ నాయకుడు జనమాల గురవయ్య ఆరోపించారు. ఆదివారం మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీల్లో కార్మికులపై కులం పేరుతో దూషిస్తూ వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. వికృతమాల వద్ద టిటిఇ కంపెనీలో ప్రకాశం జిల్లా వాసి భాగ్యనాయక్ సుమారు ఆరు నెలలుగా సెక్యూరిటిగా పని చేస్తున్నారని కంపెనీలో పని చేస్తున్న సిఎస్ఓ సూర్యరెడ్డి తన కార్యాలయానికి పిలుచుకొని కులం పేరుతో దూషిస్తూ కర్రతో గొడ్డును బాదినట్లు బాది గాయపరచారన్నారు. ఆయన్ను పరామర్శించిన సిపిఐ నాయకులు పరామర్శించారు. పోలీసు అధికారులు పట్టించుకోక పోవటం దారుణమన్నారు.సూర్యారెడ్డిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు.ఈ మేరకు పట్టణ కార్యదర్శి రోడ్ల గోపి, ప్రజా సంఘాల నాయకులు చందమాల కోటయ్య, తమీన్, రాఘవులు,శేఖర్,చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## రఫీ ఏమయ్యాడు?

**తొట్టంబేడు,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తికి సమీపంలోని సాయిబాబా ఆలయానికి సమీపంలో నివాసముంటున్న హుసేన్‌బాషా తనయుడు షేక్ రఫీ(28) రెండు రోజులుగా కనబడటం లేదని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఆదివారం టూటౌన్ సిఐ నాగార్జునరెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ నేపధ్యంలో రఫీకి సంబంధించిన వివరాలు తెలుపుతూ రఫీ వాహనాలు కొనటం అమ్మటంను వృత్తిగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 5వ తేది రాత్రి నుంచి కనబడటం లేదని ఫిర్యాదు చేసారు.ఎవరికైనా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## బత్తినయ్యకాలనీలో వైకాపా ఆందోళన

**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



ఏర్పేడు మండలం ముసలిపేడు పంచాయతీలోని బత్తినాయ్య కాలనీలో ఆదివారం వైకాపా నాయకులు బాబుషూరిటి మోసం గ్యారంటీ,బాబును రీకాల్ చేయాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. మండల వైకాపా నాయకుడు గుర్నేరి కిషోర్‌రెడ్డి సారథ్యంలో ఆందోళనను చేపట్టారు. ఎన్నికల ముందు ఎన్నో పథకాలను చెప్పి అధికారం చేపట్టిన తరువాత విస్మరించారన్నారు. ఏడాదిన్నర పానలలో సూపర్ సిక్స్‌ను సూపర్ ఫ్లాప్‌లుగా మార్చారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌ంరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, వైస్ ఎంపిపిలు జి.శ్రీనివాసులు,టి.జనార్ధన్‌రెడ్డి కోఆప్షన్ సభ్యులు బత్తిశెట్టి సర్పంచ్‌మోహన్‌ప్రియ, సర్పంచ్ నిర్మల మండల ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి మునిరత్నం రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మెన్ నాగార్జున్‌రెడ్డి, పార్టీ నాయకులు బత్తెయ్య యాదవ్, వై.శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌ంరెడ్డి, గురునాధం, ప్రభాకర్‌రెడ్డి, గురువారెడ్డి, వెంకటేష్‌యాదవ్, మహేష్,నాగూరు రెడ్డి, కేశవఉులు,జిపి యాదవ్, వినోద్‌రెడ్డి, కుమార్, కమలాకర్, సబ్బమ్మ,జయశ్రీ పాల్గొన్నారు.

## జగన్ జీవితం అబద్ధాల మయం



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి జీవితం అంతా అబ్బద్దాల మయమని తెలుగుదేశం బిసి నాయకులు శివమెత్తారు. ఆదివారం డాక్టర్ ఉమేష్‌రావు సారథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సంపూర్ణ మధ్యపాన నిషేధమంటూ వేల కోట్ల రూపాయల సంపాదన కోసం జనం ప్రాణాలతో చెలగాటమాడిన ఆయన నేడు నీతులు చెప్పటం గమనిస్తే గురువింద సామెత గుర్తుకు వస్తుందని ధ్వజమెత్తారు. తన ప్రభుత్వంలో రూ.8500కోట్లతో 17 మెడికల్ కళాశాలు ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికి గాలికి వదలిపెట్టారన్నారు. నేడు చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారంటూ బీద ఏడుపులు ఏడుస్తున్నాడని ధ్వజమెత్తారు. సమావేశంలో ఆయనతో పాటు తెలుగేదేశం బిసి నాయకులు దశరధాచ్చారి, మిన్నల్‌రవి, బీమాల భాస్కర్‌ముదిరాజ్, మునిరాజాయదవ్, వజ్రం కిషోర్, గాజుల భరత్, మణి, సంజాకుల మురళీకృష్ణ, కృష్ణమూర్తి, మురళీనాయుడు, సులేమాన్, శివ, చంద్రమౌళి, సిరాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**తిరుచానూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారంతపు సాంస్కృతి కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం కళాకారుల నృత్య ప్రదర్శనతో చూపరులను అలరించింది. శిల్పారామం ఏవో సుధాకర్ సమాచారం మేరకు చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లికి చెందిన కళాతరంగని సంస్థ వారిచే వివిధ సినీ గీతాలు, జానపద, భక్తిగీతాలుకు నృత్య ప్రదర్శన చేపట్టారు. ఇందులో భాగంగా మహాగణపతి, హర హర శంభో,ఎట్టా చెప్పను మొదలు కీర్తనలకు నృత్య ప్రదర్శనలతో వీక్షకులను అలరించారు. కళాకారులు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కింగ్ కారులో...అమ్మవారి భక్తుల లగేజ్ చోరీ

**తిరుచానూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**

అమ్మవారి ఆలయానికి టాక్సీ ద్వారా విచ్చేసిన భక్తుల బ్యాగులను డ్రైవరుకు తెలియకుండానే చోరీ చేసిన ఘటన తిరుచానూరులో ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాధారణంగా అమ్మవారి ఆలయానికి విచ్చేసిన భక్తులు వివిధ వాహనాల ద్వారా తిరుచానూరుకి చేరుకోవడం విధితమే. ఇందులో భాగంగా శనివారం అమ్మవారి ఆలయానికి విచ్చేసిన భక్తుడు తమ లకేజీ మొబైలను వాహనంలోనే విడిచి అమ్మవారిని దర్శించుకుని తిరిగి తమ తమ గమ్యాలకు తిరుగు ప్రయాణం కావడం మామూలే. ఇదిలా వుండగా అమ్మవారి దర్శనానంతరం తమ కారు వద్దకు తిరిగి వెళ్లిన భక్తుడు కారులో లగేజ్ లేకపోవడం చూసి చోరీకి గురైందని గ్రహించి తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల సమాచారం మేరకు చెన్నైకు చెందిన హరిహరన్ తమ సొంత వాహనంలో శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం తమ కారు వద్దకు వచ్చి చూడగా కారులో ఉన్నటువంటి నాలుగు బ్యాగులు చోరీకి గురి అయిందని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బ్యాగులో 25 వేలు నగదు, రెండు మొబైల్ ఫోన్లు వున్నట్లు తెలిపారు.అనంతరం పోలీసులు సహకారంతో సంఘటన స్థలంలోని సిసి పుటేజులు పరిశీలించగా నలుగురు దుండగులు పక్కా ప్రణాళికతో చోరీ చేశారని తెలుసుకున్నారు. దుండగులను గాలిస్తామని వారు దొరికిన వెంటనే తమకు సమాచారం తెలియజేస్తామని పోలీసుల తెలపడంతో వారు తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ సందర్భంగా బాధితుడు హరిహరన్ మాట్లాడుతూ దుండగలను త్వరతగతిన పట్టుకోవాలని తనకు జరిగిన విధంగా ఇతర భక్తులకు దోపిడీకి గురికాకుండా చర్యలు చేపట్టాలని తిరుచానూరు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## గీతా మందిరంలో సత్యనారాయణ స్వామి వ్రతం

**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతా మందిరంలో పౌర్ణమి సందర్భంగా శ్రీ సత్యనారాయణ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం చంద్రగ్రహణం సందర్భంగా ఉదయమే ఆలయంలో శ్రీ సత్యనారాయణ వ్రతం నిర్వహించినట్లు గీతా సేవా సమాజం వారు తెలిపారు. వ్రతం అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా మూసేశారు. సోమవారం ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసి ఆ తరువాత నిర్వహించి పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు వివరించారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలు

**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికుల ఆహ్వానం మేరకు పుత్తూరు పట్టణంలోని జెండామాను వీధిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామిని తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మణికంఠ, పోతుగుంట రమేష్, కౌషిక్, ఉదయ్, శివ, లీలాకృష్ణ, కార్తీక్, నరేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య భద్రతే తన లక్ష్యం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



స్థానిక న్యూ ఇందిరానగర్ లో ఆదివారం ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రాపూరి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా వైద్య శిబిరం నిర్వహించారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా నిపుణ వైద్యులు స్థానిక ప్రజలకు రక్తపోటు,మధుమేహం, హృదయ సంబంధిత వ్యాధులు, కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే చిన్నారులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైనప్పుడు తగిన ఔషధాలు ఉచితంగా అందజేశారు. సుమారు 300 మందికి పైగా ప్రజలు ఈ శిబిరంలో వైద్య సేవలను పొందారు. వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన డాక్టర్లకు, సిబ్బందికి రాపూరి ప్రసాద్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.స్థానిక యువత,కాలనీ సంఘాల ప్రతినిధులు, ప్రెసిడెంట్ సరళ కుమారి, వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ, ట్రెజరర్ శాలిని, నాయకులు ప్రభు, మహిళలు చురుకుగా పాల్గొన్నారు.

## శెట్టిపల్లి రైతులకు న్యాయం చేయాలి

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



శెట్టిపల్లి భూ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌లు పరిష్కరించడం సంతోషంగా ఉందని చెబుతూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను రైతులు ఆదివారం ఉదయం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి ఎంతో కృషి చేశారని రైతుల తరుపున బాల మురళీకృష్ణ,రామకృష్ణాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఫోటో:తిరుపతి విద్య(2)

## గంగమ్మ ఆలయానికి భూమి కొనుగోలు

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయంకు భూమిని దాతల సాయంతో కొనుగోలు చేశారు. ఆలయంలోని వినాయకుని గుడిని ఆనుకుని ఉన్న ముప్పయ్ ఒకటిన్నర అంకణాల ప్రైవేట్ భూమిని యాభై లక్షలకు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్‌ను గంగమ్మ తల్లి వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఈఓ జయకుమార్‌లు ఉంచి పూజలు నిర్వహించారు. మొత్తం యాభై లక్షలకు గాను 25 లక్షల రూపాయలను అడ్వాన్స్‌గా ఇచ్చారు. అడ్వాన్స్ మొత్తాన్ని రాయలసీమ విద్యాసంస్థల అధినేత లావణ్య ఆనంద్ రెడ్డి, కవిత,మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు తలా ఐదు లక్షల వంతున అందించారు. మిగిలిన 25లక్షలను ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారని త్వరలోనే నగదు మొత్తం చెల్లిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మబ్బుదేవ నారాయణ రెడ్డి, పులుగోరు మురళీ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, చింతా భరణీ యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, రాజారెడ్డి, గంజి సుధాకర్ రెడ్డి, వెంకటేష్, పగడాల మురళీ, ఆముదాల వెంకటేష్, ఆళ్వార్ మురళీ, కోదండ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉదయ్ ముదిరాజ్, జానకి రామ్‌రెడ్డి, బుజ్జిబాబు, రుద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎంఎల్ఏ

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడుబ బియ్యపు మధుసూధనరెడ్డి పార్టీ కార్యాలయంలో ఆదివారం అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ నెల 9న ఆర్‌డిఓ కార్యాలయం వరకు అన్నదాతలు తాము ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి పోరుకు సిద్ధం కావాలని మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు.పార్టీ కార్యాలయం నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ర్యాలి నిర్వహించుటకు నిర్ణయించినట్లు మధుసూధనరెడ్డి వివరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత,అన్నదాతసుఖీభవ సక్రమంగా అందక పోవటంపై ఆందోళన చేయటానికి నిర్ణయించినట్లు మధుసూధనరెడ్డి వివరించారు. ఉచిత పంటల బీమా పథకాలను పునరుద్దరించాలన్నారు.ఈ కార్యక్రమాల్లో బియ్యపు మధుసూధనరెడ్డితో పాటు చెవిరెడ్డి మధుసూధనంరెడ్డి, ఉత్తరాజి శరవణ కుమార్, ముత్తు, సిరాజ్, సురేష్, కంటా ఉదయ్‌కుమార్, ఫజల్, పులి రామచంద్ర, ఆర్కాట్ శంకర్, చుక్కల కిరణ్, పెరుమాళ్‌చౌదరి, బావాజి, మున్నారాయల్,నారాయణ, జయకృష్ణారెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కల్యాణ వెంకన్న ఆలయం మూసివేత

**చంద్రగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:**



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం శనివారం సాయంత్రం 6.30 గంటలకు మూసివేసినట్లు ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాన్ని మూసివేస్తున్నట్లు వివరించారు. గ్రహణం అనంతరం తిరిగి సోమవారం ఉదయం అర్చకులు ఆలయాన్ని ఆగమోక్తంగా శుద్ధి నిర్వహించి, తగిన పూజాది నిత్యకైంకర్యాలను నిర్వహిస్తారని అన్నారు. తదుపరి ఉదయం 9 గంటలకు భక్తులకు స్వామివారి పునర్దర్శన భాగ్యం కల్పించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైస్తవ మందిరం నిర్మానానికి ఎమ్మెల్యే విరాళం

**నారాయణవనం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :**

మండలంలోని భీమునిచెరువు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న క్రైస్తవ మందిరం నిర్మాణానికి సంబందించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ 25వేల రూపాయాలను ఆదివారం అందించారు. ఈనెల 14వ తేది ఆదివారం సాయంత్రం ఈ చర్చిని ప్రారంభిడం జరుగుతుందన్నారు. మందిరం నిర్మాణానికి విరాళం అందించడంతో చర్చి ఫాస్టర్, క్రైస్తవ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

## చంద్రగ్రహణంతో మూతపడ్డ టిటిడి ఆలయాలు

**నారాయణవనం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :**



ఆదివారం చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం 3గంటలకు నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు ఆంజనేయస్వామి, చంపకవల్లీ సమేత పరాశారేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, సముదాయం శక్తి వినాయకుని ఆలయం, మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని ఆలయం, శ్రీ అవనాక్షమ్మ అమ్మవారి ఆలయంతో పాటు నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతా సొరకాయులస్వామి ఆలయంను మూసివేశారు. సోమవారం ఉదయం 6గంటలకు ఆలయాన్ని తెరిచి శుద్ధి, అభిషేకం, అలంకరణ తర్వాత భక్తులకు దర్శనం అందించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా పౌర్ణమిపూజలు

**నారాయణవనం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో అవదూతగా వెలసిన తాతా సొరకాయుల స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పౌర్ణమిపూజలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత అభిషేకం, అలంకరణ తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం 4గంటలకు చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయాన్ని తెరిచి శుద్ధి అనంతరం దర్శనం ఏర్పాట్లు వుంటుందన్నారు.

## దారికాచి పెట్రోల్ బంక్ మేనేజర్‌పై దాడి!

**భాకరాపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త :**

చిన్నగొట్టిగల్లు మండలకేంద్రంలో గల పెట్రోల్ బంక్ లో మేనేజర్ గ రాధాకృష్ణ విధులునిర్వహిస్తున్నాడు శనివారం రాత్రి ఎనిమిది గంటలకు విధులు ముగించుకొని అయన స్వగ్రామం కుమ్మరపల్లె వెళ్తుండగా దారికి కంపలు అడ్డంగా ఉండడంతో బండి ఆపి కంపలు తొలగిస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా గాయపరిచి తనదగ్గరున్న డబ్బు తీసుకొని పారిపోయారని రాధాకృష్ణ తెలిపారు.

## అప్పలాయగుంట ఆలయం మూత

**వడమాలపేట, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**



చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 1.50 గంటలకు అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం మూసివేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ సోమవారం ఉదయం ఆలయాన్ని తెరిచి శుద్ధి చేసి, సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారని ఆయన తెలిపారు. ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి రసాయనిక ఎరువులు పంపిణీ

**విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**

మండలంలోని విజయపురం, ఆలపాకం, పొన్నూరు, జగన్నాథపురం, శ్రీహరిపురం, కాళికాపురం తదితర సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన రసాయన ఎరువులు పంపిణీ జరుగుతుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం,ఆధార్‌కార్డు తీసుకువచ్చి ఎరువులు పొందవచ్చని ఆమె తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**విజయపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**



మండలంలోని పలువురికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందించారు. ఇందులో మండలంలోని పీఆర్ కండ్రిగకు చెందిన కె.మహేశ్వరికి 42.746లు, పన్నూరు ఆది ఆంధ్రవాడకు చెందిన పావనికి22,302 రూపాయలు, ఆలపాకం గ్రామానికి చెందిన మునిరత్నమ్మకు 86,957 రూపాయలు, కాళికాపురం గ్రామానికి చెందిన నాగరాజన్‌కు 43,154 రూపాయలు విలువగల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిధులను స్వాహా చేసిన సంఘమిత్రలు

**కేవీబీ పురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:**



మహిళా సంఘాల నిధులను సంఘ మిత్రలు తినేసిన సంఘటన కేవీబీ పురం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మండలంలోని ఏగపూడి, దిగువపూడి, పీసీకీ పురం ఈ గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు వారి నిధులను సంఘమిత్రలు సుమారు 4 నుంచి 6 లక్షల రూపాయల వరకు తమ నిధులను అక్రమంగా తినేశారని గ్రామాల మహిళలు కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వారు వాపోతున్నారు. కావున కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆ గ్రామాల్లోని సభ్యులందరూ సంఘాలకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు తెలిపారు. సంబంధిత కార్యాలయ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. దీంతో పోలీస్‌స్టేషన్ నుంచి ఆ సంఘ సభ్యులు గ్రామాలకు వెళ్లారు.


**NOTICE UNDER SECTION 17 OF SECURITIZATION ACT R/W PROVISIONS OF BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, AT: HYDERABAD**

SA. No. 254/2025

Sri V.Nagaiah S/o Late Vangalapari Papaiah ...Applicant

V/s

Union Bank of India and others ...Respondents

**NOTICE TO THE RESPONDENTS:**

5) Smt. M. Nalini, wife of A. Neeraj, D/o Sri M. Chenga Reddy, aged about 35 years,

6) Smt. M. Anitha Reddy, D/o Sri M. Chenga Reddy, aged about 33 years, D.No.18-5-339, Sapthagiri Nagar, Near CPM Office, Tirupati, Tirupati Urban Mandal, Tirupati District.

7) Smt. M. Lavanya, D/o.M. Chenga Reddy, aged about 31 years, Residing at Flat No.330, Srikrishna Apartment, Bairagipatteda, Tirupati, Tirupati Urban Mandal, Tirupati District.

An application under Section 17(1) of the Securitization & Reconstruction of Financial Assets & Enforcement of Security Interest Act, 2002 has been filed before this Tribunal (A copy of application is enclosed).

Show cause as to why the relief prayed for should not be granted. You are required to file reply, if any, in your defence in the paper book form in two complete sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before this Tribunal on 06.10.2025 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 22nd day of August, 2025

By order of Tribunal

**Registrar**

## ఎరువుల కోసం అన్నదాతల అవస్థలు : కిలివేటి



నాయుడుపేట, సెప్టంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎరువుల కోసం అన్నధాతలు అవస్థలు పడుతున్న కూటమి ప్రభుత్వం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుందని సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఆయన ఆదివారం నాయుడుపేట వైసిపి క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లడుతూ రాష్ట్రంలో ఎరువుల కొరతతో రైతులు అవస్థలు పడుతున్న కూటమి ప్రభుత్వం అన్నధాతల సమస్యలను గాలికి వదిలేచిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మెరకు ఈనెల 9వ తేదిన సూళ్ళూరుపేటలో చేపట్టబోయే అన్నదాత పోరకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వీరేంధ్రవర్మ, వైసిపి రాష్ట్రకార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, జిల్లాఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, మున్సి పాల్టి చేర్మేన్ కటకం దీపిక, వైసిపి పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, ఓట్టూరు కిషోర్ యాదవ్, కటకం జయరామయ్య, కౌన్సి లర్లు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఈ నెల 9న అన్నదాత పోరు : ఎమ్మెల్యే



గూడూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: నియోజక వర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్‌ని ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ మెరిగా మురళీధర్ ఆదివారం గూడూరులోని సనత్ నగర్ నందు గల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలలో రైతులకు వెన్నుదన్నుగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత వారికి దక్కుతుందన్నారు. వ్యవసాయం లాభసాటిగా ఉంటేనే, రైతు సంతోషంగా ఉంటూ అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతులకు సంఘీభావంగా రైతు సమస్యలను ప్రభుత్వానికి వివరిస్తూ ఈ నెల 9వ తేదీ వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించి, రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి మెమోరాండం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటుగా అన్నదాతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## టీడీపీ తోనే బీసీల అభివృద్ధి : ఎమ్మెల్యే



గూడూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: టిడిపి ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్య ఒక్కటే మార్గం అని విద్యార్థులు బాగా చదువుకొని ఎదగాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేటలో బీసీ హాస్టల్ భవనాన్ని బీసీ హాస్టల్ భవనాన్ని ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ బీసీలకు టిడిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని తెలిపారు. బీసీల కొరకు ప్రత్యేక హాస్టల్లో మంజూరు చేయడం జరిగిందని అన్ని వసతులతో హాస్టల్ భవనం అందుబాటులోకి రావడం సంతోషమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి చెంచురామయ్య, ధనుంజయ రెడ్డి, మీరా రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు జహంగీర్, రహీం, ఇజ్రాయిల్, అల్లి భాష, నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు



గూడూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికై నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆదివారం పదవరోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్ కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వన్ బార్ 19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, డిపోలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జోనల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె అహ్మద్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య గూడూరు, వాకాడు అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, సంపత్, ప్రశాంత్, భాష, శ్రీనివాసులు, గౌస్, నారాయణ, సందాని, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్‌లకు డియస్‌పి వార్నింగ్

**- తహసీల్దార్ ఎదుట 100 మంది బైండోవర్**



గూడూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: గూడూరులో రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో మెలగాలని అలాగే గూడూరులో త్వరలో జరిగే దసరా ఉత్సవాలలో జాగ్రత్తగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి వార్నింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు వందమందిని బైండోవర్ చేసిన సందర్భంగా ఆమె ఆదివారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో రౌడీలకు మాస్ హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ఎంత ప్రశాంతంగా జరుపుకున్నామో అలాగే వెంకటగిరి జాతర, దసరా, కలిశాలు, జెండాపండుగను నిర్వహించాలని, ఈ నేపథ్యంలో రౌడీలును బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ శేఖర్ బాబు, రూరల్ యస్ఐ మనోజ్ కుమార్, టూ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు రాజు, ఏఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాధునికి సాంస్కృతిక నీరాజనం






కాణిపాకం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఆదివారం జరిగిన రావణబ్రహ్మ వాహనసేవ సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈమేరకు ఉదయం నుండి రాత్రి వరకు ప్రముఖ కళాకారులచే హరికథలు, భక్తిరంజని, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు వంటి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



చంద్రగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 12 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జిల్లా స్థాయి సన్మానగ్రహీతలైన రామిరెడ్డి, వెంకటరెడ్డి, నాగులు, మురగయ్య, శైలజ టీచర్లను ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ 2 భాస్కరబాబు, హెచ్ఎం శారద ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జగదీష్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యావ్యవస్థకు అందించిన సేవలను కొనియాడారు.

## భద్రతే ధ్యేయంగా నిబంధనలు పాటించండి

**-భక్తులకు మర్యాదపూర్వక సేవలు-మఠాలు, అతిథిగృహాల నిర్వాహకులకు ఆదేశం**



తిరుమల, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో అత్యంత వైభవంగా తొమ్మిదిరోజులు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల భద్రతే ధ్యేయంగా మఠాలు, అతిదిగృహాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని తిరుమల సిఐ విజయకుమార్, విఎస్ఓ సురేంద్ర సూచించారు. ఖచ్చితంగా గదులకోసం వచ్చే భక్తుల వివరాలను, ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి పోలీసులకు తెలియజేయాలన్నారు. బ్రహ్మోత్సవాల భద్రత, మఠాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం సాయంత్రం తిరుమల పోలీసులు, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో పలు సూచనలు జాగ్రత్తలు తెలిపారు. భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, వారికి తగిన సేవలందించాలన్నారు. 150మంది వరకు పాల్గొన్న ఈ సమావేశంలో పలు కీలక విషయాలు తెలియజేశారు. ఈ సమావేశంలో హోటళ్ళయాజమానులు, మఠాల నిర్వాహకులు, గెస్టహౌస్‌ల మేనేజర్లు పాల్గొని ట్రాఫిక్, భద్రత, ఆహారపదార్థాలపై సూచనలు పాటిస్తామని తెలిపారు.

## గ్రహణం వేళ...



**గోవిందుని ఆలయంపై మేఘమాల**

చంద్రగ్రహణం వేళ ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయంలో నల్లనిమేఘాలు గోవిందుని ఆలయంపై కమ్మేశాయి. ఆహ్లాదకర అద్భుత దృశ్యం తిరుమలలో కనువిందుచేసింది.
-ప్రభాతవార్త-తిరుమల

## శ్రీచెంగాళమ్మ దేవస్థానంలో చండీయాగం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీచెంగా ళమ్మ పరమేశ్వరి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా మహాచండీ యాగాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గోమాతకు పూజలు చేసిన అనంతరం దేవస్థానం ప్రాంగణంలోని యాగ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన యాగం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. భైరి పార్థసారధిరెడ్డి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం సహాయక కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

## చంద్రగ్రహణంతో శ్రీచెంగాళమ్మ ఆలయం మూసివేత



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానాన్ని సంపూర్ణ చంద్రగ్రహాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేశారు. భక్తులకు దర్శనాలను నిలిపివేశారు. తిరిగి సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించనున్నట్లు దేవస్థానం సహాయక కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మండలంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఆదివారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంచల ఉషాకుమారి, దొంతి లావణ్య, సూరంపూడి పద్మ సరోజిని, మాడా అనురాధ, ఎం.రామలక్ష్మమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గణపయ్యా.. తరించామయ్యా



కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: కోటలో ఏ వీధిలో చూసినా డప్పుల చప్పుళ్లే. ఏ వాడ కదిలినా సంబరాలే. చిన్నాపెద్ద తేడా లేకుండా ఆనందంతో నృత్యాలు చేస్తూ ఆదివారం రాత్రి కోటలో జై బోలో గణేష్ మహారాజ్‌కి అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. వినాయక చవితి నాటి నుంచి నవరాత్రుల పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య చివరిరోజు గంగమ్మ ఒడికి చేరారు. అంతకుముందు కోటలోని దళితవాడలో వినాయక మండపం వద్ద రాష్ట్ర వైసీపీ నాయకులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైసీపీ విభాగం రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు జలీల్ అహ్మద్, దారా సురేష్, షంషుద్దిన్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన







తిరుపతి హెల్త్, సెప్టెంబరు 7 ప్రభాతవార్త : స్థానిక రెడ్డి రెడ్డి కాలనీ వెంకటరమణ గుండె, మెటర్నటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేటలో పోలా వారి కాకతీయ విద్యా సంస్థలు ఆర్ఎస్ రోడ్డులో నిర్వహించిన ఉచిత మెగా శిబిరానికి రాజంపేట ప్రజలు, రోగులు, యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వెంకటరమణ గుండె, మెటర్నటీ ఆస్పత్రి సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి. వెంకటరమణ, స్త్రీల వైద్యనిపుణులు డాక్టర్ ఆర్. నిరూపమ, ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ ఏ శ్రీకాంత్ యాదవ్‌లు రోగులకు, ప్రజలకు ఈసీజీ, గుండె స్కానింగ్, ఊపిరితిత్తుల పరీక్షలు, పిల్లలు లేనివారికి, షుగర్ పరీక్షలు, బీపీ, ఇతరత్రా పరీక్షలు వారితో పాటు స్పెషలిస్టుల ద్వారా అన్ని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రోగ తీవ్రతను బట్టి రోగులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నిరూపమ, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి రోజు వ్యాయామంతో పాటు ఆకు కూరలు, పండ్లు, గుడ్లు, పాలు తీసుకోవాలన్నారు. ఆయిల్ ఫుడ్‌ను పూర్తిగా నిషేధించాలని తెలిపారు. కనీసం రెండు, మూడు నెలలు ఒక పర్యాయం హెల్త్ చెకప్ చేసుకుంటూ ఆరోగ్యాన్ని నిండు నూరేళ్ళు ఉండేలా చూసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలు తిరుపతి రెడ్డి రెడ్డి కాలనీ వెంకటరమణ గుండె, మెటర్నటీ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి రాజంపేటలో నిర్వహించడం సంతోషంగా ఉందని కొనియాడారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో డాక్టర్లతో పాటు స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రహణ కాలంలో పోటెత్తిన భక్త జనం

**-భారీ ఎత్తున సర్వదోష నివారణ పూజలు**



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం రద్దీ పెరిగింది. తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులు అక్కడ చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూత వేయటంతో అక్కడి జనం శివయ్య దర్శనానికి తండోపతండాలుగా కదలి వచ్చారు. ఒక్కరోజు అక్కడ విడిది చేయలేక వచ్చిన భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి వచ్చారు. ఉదయం నుంచి ఎటు చూసినా భక్త జనమే అన్నట్లు మారి, సన్నిధివీధి అంతా జన మయంగా మారింది. ఓ వైపు కాలినడకన వచ్చే భక్తులు మరో వైపు వాహనాల రద్దీతో కిట కిట లాడింది. అధికారికంగా దేవస్థానం జారి చేసిన సమాచారం మేరకు 30 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా సుమారు 6వేలు దాటాయి. ఇక అభిషేకాలు కకూడా గణనీయంగా జరిగాయి. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకొనుటకు తండోపతండాలుగా కదలి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాల యానికి వారాంతంలో తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. అలాగే విఐపిలతాకిడి కూడా అధికంగానే ఉంటుంది. ఇక్కడి అతిధి గృహాలు ఏ ప్రాతిపదికపై ఎవరికి ఇస్తున్నారో అగమ్యగోచరంగా మారింది. దాంతో వచ్చే భక్తులు, విఐపిల పరిస్తితి ఆగమ్యగోచరంగా మారింది. రోజుకొక నిబంధనలతో గందరగోళంగా మారుతుంది.

## అపోలో యూనివర్సిటీలో ఘనంగా 'ప్రారంభ్-2025'



చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: చిత్తూరు మురకంబట్టు అపోలో నాలెడ్జ్ సిటీలో అపోలో యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభ్-2025 ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొత్త విద్యార్థులు అపారమైన ప్రతిభతో వస్తారన్నారు. ఇక్కడ వున్న వారిలో ప్రతి ఒక్కరు ఒకొక్క బండిల్ ఆఫ్ ట్యాలెంట్ అన్నారు. ప్రారంభంలో సవాళ్ళు కన్పించినా క్రమశిక్షణ, సృజనాత్మకత, విలువలు ఆవిష్కరణలతో ముందుకు సాగితే మంచి భవిష్యత్తుకు పునాది పడుతుంద న్నారు. ఫ్రెషర్స్‌డే వేదిక మీ ప్రతిభను వెలికి తీయడానికి, ఆత్మవిశ్వాసంను పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆధ్యాపకులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విశిష్ట అతిధులు హాజరై సంబరాలకు జోష్ తెచ్చారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పౌరాణిక నాటికలు, ఆధునిక నృత్యాలు, సాంప్రదాయ నృత్యావిష్కరణలు ప్రేక్షకులను ఆలరించాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతురాజు, డీన్‌లు డాక్టర్ జగదీషన్, భాస్కర్‌రెడ్డి, రామయ్య ఇటుమల్ల, అధ్యాపకులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మీ అభిమానాన్ని జీవితంలో మరచిపోలేను : సీఐ



కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: ప్రజలు, ప్రజాసంఘాలు తనపై ఇంత అభిమానాన్ని చూపించడం జీవితంలో మరచిపోలేనని సీఐ వెంకటరమణ అన్నారు. ఆదివారం కోటలో అంబేడ్కర్ విగ్రహానికి సీఐ వెంకటరమణ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం దళిత సంఘాలు, ప్రజాసంఘాలు, ఆటో కార్మికులు అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా షాదీమంజిల్‌కు చేరుకున్నారు. సీఐ వెంకటరమణకు ప్రజాసంఘాలు గజమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ తాను కోటలో 16 సంవత్సరాల క్రితం ఎస్ఐగా పనిచేసిన సమయంలో అందించిన సేవలను ప్రజలు ఇంతగా గుర్తుపెట్టుకుని తనపై అభిమానం చూపి సన్మానం చేయడం చూస్తుంటే జీవితంలో మరచిపోలేని అనుభూతి కలిగిందన్నారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కోట చరిత్రలో ఒక ఎస్ఐకి ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి సన్మానం చేయడం మరచిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, బిఎస్‌పి నాయకులు మాధవ్, ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ రామకృష్ణ, రంగనాథం, శారదమ్మ, కృష్ణయ్య, సారంగం విజయభాస్కర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతర చరిత్ర పుస్తక ఆవిష్కరణ



వెంకటగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: ఎన్వీఆర్ చారిటబుల్ సొసైటీ వారు నిర్వహిస్తున్న సేవలు అభినందించదగ్గ విషయమని టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వరరావు తెలిపారు. వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర చరిత్ర బుక్కును గుడి వద్ద ఈవో శ్రీనివాసులురెడ్డి, ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. 18 సంవత్సరాల నుండి జాతర సందర్భంగా అందరికి తెలిసేందుకు పోలేరమ్మ చరిత్ర బుక్లెట్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి, వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, సీనియర్ న్యాయవాది సుంకర రాజేష్, మల్లికార్జున్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 16న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వెంకటగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీ ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో 16వ తేదీ ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాగునీరు, ఉపాధి హామీ పథకం పారిశుధ్యం తదితర పనులపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

## నేదురుమల్లి కుటుంబంతోని అభివృద్ధి సాధ్యం

వెంకటగిరి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: వెంకటగిరి నియోజకవర్గ నేదురుమల్లి కుటుంబ వాళ్లే అభివృద్ధి జరిగిందని నియోజకవర్గ వైఎస్సార్సీపి ఆర్టీఏ విభాగం అధ్యక్షులు, కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. జనార్దన్ రెడ్డి సీఎంగా ఉండగా చేనేత శిక్షణ సంస్థ, తొమ్మిదవ ప్రత్యేక పోలీస్ బెటాలియన్, నిమ్మ పరిశోధన కేంద్రం, గురుకుల పాఠశాల, పట్టణంలో సిమెంట్ రోడ్లు వంటి అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఎమ్మెల్యేగా మంత్రిగా ఉండగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశాడని తెలిపారు.

## భానుడు కాక.. వరుణుడు అలక

కోట, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: జిల్లాలోని వాతావరణం సెప్టెంబర్ మొదటి వారంలోనే వేసవి కాలాన్ని తలపిస్తోంది. గత వారంరోజులుగా పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఈ నెలలో సాధారణంగా మంచి వర్షపాతం నమోదు కావాలి. రెండోవారంలోకి ప్రవేశించినా ఎండాకాలం తరహాలో ఉదయం 9 గంటల నుంచి సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. సాయంత్రం 4 గంటలకు కూడా వేడి గాలులు తీవ్రత కొనసాగుతుంది. వర్షాకాలంలో వరుణుడు ముఖం చాటేయడం, ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి వేళల్లోను ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 30డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఖరీఫ్ కింద రైతులు వివిధ రకాల మెట్ట పంటలు సాగు చేశారు. రబీలో పంటలు సాగు చేసే రైతులు జులైలో ఓ మోస్తరు వర్షాలకే జనులు, జీలగ, నువ్వులు సాగు చేశారు. అనంతరం వరుణిడి జాడ లేకపోవడంతో అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా మొక్క దశలోనే పంటలు ఎండిపోయాయి. సరైన వర్షం లేక నువ్వు పంట దిగుబడులపై ప్రభావం చూపింది.

## ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి : డీఎస్పీ



గూడూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: ఆంధ్ర చెస్ అసోసియేషన్, తిరుపతి చెస్ అసోసియేషన్ సహకారంతో, రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో 7వ ఏపి స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. రాష్ట్రం మొత్తంలోని వివిధ జిల్లాల నుంచి మొత్తం 194 క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ షేక్ షరీఫా, చీఫ్ అర్బీటర్‌గా బాలాజి చౌదరి వ్యవహరించారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిధిలుగా గూడూరు డీఎస్పీ గీతకుమారి పాల్గొని, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రవి ప్రసాద్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆర్గనైసింగ్ సెక్రటరీ ఫణి కుమార్, రాయ్ చెస్ అకాడమీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ అజీజ్, తిరుపతి చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస సూరి, గూడూరు చెస్ అసోసియేషన్ అధ్యక్షులు నరేంద్రనాథ్ చౌదరి, కార్యదర్శి రవిబాబు పాల్గొన్నారు. అర్బీటర్లుగా మోనికా, ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, విష్ణు, ఎస్.ఆర్ దినేష్, రవి కుమార్, మోహన్, వసీమ్, హసీనా, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూత



వాకాడు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలోని ఆదివారం శ్రీ పట్టాభిరామాలయం శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నాయుడు వేంకటరమణారెడ్డి, సరోజనమ్మ దంపతుల కుటుంబ సభ్యుల బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తనుష్ కుమార్, పలుకూరు లక్ష్మి గాయత్రి అనే విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు సంస్థ ప్రతినిధులు వాకాని హేమంత్ కుమార్, తేజోవతి, శ్రీరామసేన అధ్యక్షుడు హరీష్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, శ్రీరామసేన కార్యదర్శి శివకుమార్ మస్తానయ్య, వంశీ, వినయ్, రాజేష్, యోత్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్కరపాక మాజీ సర్పంచ్ మృతి



దొరవారి సత్రం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: దొరవరసత్రం మండల పరిధిలోని అక్కరపాక గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చెన్నారెడ్డి సుధాకర్ రెడ్డి (75) అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. సుధాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుండి ఒకే పార్టీలో ఉంటూ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారు.

## ఘనంగా ముగిసిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్పో



తిరుపతి విద్య, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త: క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక డీబీఆర్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్లో ఈనెల 5,6,7 తేదీలలో మూడు రోజుల పాటు ప్రదర్శించిన క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్పో ప్రదర్శన ఆదివారం సాయంత్రంతో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీతో కూడిన ఉత్పత్తులు, వివిధ గృహ సుందరీకరణ వస్తువులు, ప్లాట్లు, అపార్ట్మెంట్, రుణ సదుపాయాలు, ఆధునాతన కార్లు వంటి వాటిని ఒకే వేదికపైకి తెచ్చి సుమారు 60 స్టాల్స్‌తో ప్రజల కలలు సాకారం చేసే దిశగా కృషి చేసిన క్రెడాయ్ ప్రతినిధులను వారు అభినందించారు. అనంతరం క్రెడాయ్ చైర్మన్ గోపినాథ్ అధ్యక్షుడు రాంప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆదరించిన విజయవంతం చేసిన ప్రజలకు, ఇందుకు సహకరించిన వివిధ కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో భవిషత్తులో మరిన్ని ప్రదర్శనల ద్వారా ప్రజల ఆశయాల సాధనకు తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు, రాజేష్ బాబు, కోశాధికారి హరికృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీధర్రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.